మురుగు..పరుగు

చేర్యాలలో రోడ్డు పై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీళ్లు

పట్టించుకోని చేర్యాల మున్సిపాలిటీ అధికారులు

చేర్యాల, జూలై 29 : పట్టణంలోని సిద్దిపేట,జనగామ జాతీయ రహదారి పై మురుగు ప్రవహిస్తున్నది. కొన్ని రోజులుగా రోడ్డు పై నుంచి డ్రైనేజీ నీళ్లు ప్రవహిస్తున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుద్దెడ–జనగామ జాతీయ రహదారి విస్తరణ పనులు సంవత్సరం నుంచి పట్టణంలో కొనసాగుతుండగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేర్యాల పట్టణంలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా పెద్దసైజు డ్రైనేజీని రోడ్డు విస్తరణ సమయంలో నిర్మించారు. రోడ్డు పక్కనే ఉన్న గృహాల యజమానులు తమ ఇంటి నుంచి బయటకు వచ్చే వృథా నీటిని సదరు డ్రైనేజీలోకి కనెక్షన్ ఇచ్చారు.దీంతో మురుగు నీరు మొత్తం డ్రైనేజీలో ప్రవహిస్తుండగా, విద్యుత్ స్తంభాలు తొలిగించకపోవడంతో కాంట్రాక్టర్ డ్రైనేజీ నిర్మాణ సమయంలో పలు ప్రదేశాల్లో డ్రైనేజీ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలిపెట్టాడు. డ్రైనేజీ నుంచి వచ్చిన నీళ్లు అక్కడ మురుగు గుంటలుగా మారి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు, ఈగలు, పందులకు నివాసయోగ్యంగా తయారైంది. ఒక పక్కన మురుగు గుంటలు, మరో పక్క డ్రైనేజీ నుంచి వచ్చే నీళ్లు రోడ్డు పై ప్రవహిస్తుండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణంలోని చుంచనకోట క్రాసింగ్ నుంచి చేర్యాలకు వచ్చే రహదారిలో ఎడమ వైపు ఉన్న డ్రైనేజీ నీళ్లు రోడ్డు పైకి వచ్చి 100 మీటర్ల దూరం ప్రవహించి అక్కడ నుంచి కుడివైపున అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ మురుగునీటి గుంటలోకి చేరుతున్నది. అధికారులు అదే రోడ్డుపై నిత్యం ప్రయాణిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు.

గజ్వేల్‌లో ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న డీఎం పవన్, ఎస్సై యాదగిరిరెడ్డి

గజ్వేల్, జూలై 29: ప్రతి డ్రైవర్ ప్రమాద రహితంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని గజ్వేల్ డీఎం పవన్ అన్నారు. సోమవారం ప్రమాద రహిత వారోత్సవాల ముగింపులో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రోడ్డుకు ఎడమవైపు బస్సులు నిలుపాలని, పాదచారులను చూసుకొని పట్టణంలో నెమ్మదిగా వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ విధులు ముగిసిన తర్వాత విశ్రాంతి తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఉత్తమ డ్రైవర్లు రాములు, మసూద్, నర్సింహులును సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. బెస్ట్ ఆయిల్ సేవ్ డ్రైవర్లుగా కిష్టయ్య, డీబీరెడ్డిలకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై యాదగిరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిరండి

చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

హుస్నాబాద్‌టౌన్, జూలై 29: మాలమహానాడు ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆగస్టు 7,8,9వతేదీల్లో నిర్వహించే సామాజిక దీక్షల కోసం తరలిరావాలని మాలమహానాడు సంఘం పిలుపునిచ్చింది. హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం కరపత్రాన్ని ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు బూరుగు కిష్టస్వామి, యాస శ్రీనివాస్ మాట్లాడారు. మాలమహానాడు సంఘం నాయకులు బందెల హరీశ్‌బాబు, నోముల బాలయ్య, జెల్ల రమేశ్, జాల శ్రీనివాస్, బోజు రమేశ్, సంపత్, గడిపె బాలు, బీక్యానాయక్, వేణు, సారయ్య పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

కొమురవెల్లి, జూలై 29 : తెలంగాణ కల్లు గీత కార్మికసంఘం ఆధ్వర్యంలో కొమురవెల్లి మండల కేంద్రంలోని పద్మ శ్రీ గార్డెన్‌లో ఆగస్టు 2న జరిగే మండల మహాసభను జయప్రదం చేయాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం కొమురవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో గీత కార్మికులను కలిసి కేజీకేఎస్ మహాసభకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తళ్లాపల్లి రాజుగౌడ్, గన్నేబోయిన నర్సింహులుగౌడ్, శివలింగు రమేశ్‌గౌడ్, బూర్గు భరత్ పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో విద్యార్థులు

సిద్దిపేట కమాన్, జూలై 29 : హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27, 28న జరిగిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లా తైక్వాండో విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి పథకాలు సాధించారని జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సిద్దిపేటలో శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాడెట్ విభాగంలో ఎం.విజయశ్రీనరసింహ (గోల్డ్ మెడల్) ఎం.బిందు (సిల్వర్ మెడల్) డి. ప్రహ్లాదిక, బి.సుదాన్స్ (బ్రాంజ్ మెడల్) సాధించారన్నారు. ఎం.విజయశ్రీనరసింహ ఉత్తమ ప్రతిభ చూపి ఆగస్టు 1 నుంచి 4 వరకు ఏపీలోని విశాఖపట్నంలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన విజయశ్రీనరసింహతో పాటు మెడల్స్ సాధించిన విద్యార్థులను రాష్ట్ర తైక్వాండో అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా తైక్వాండో గౌరవ అధ్యక్షుడు వేలేటి రాధాకృష్ణశర్మ, ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.రామ్మోహన్, మెరీడియన్ విద్యాసంస్థల డైరెక్టర్ వంగ దేవేందర్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు.

కస్తూర్బాలో బోనాల పండుగ

బోనాల పండుగలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై29: మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సోమవారం బోనాల పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బాలికలు పోతరాజు, శివసత్తుల వేషధారణలతో బోనాలు నెత్తిన పెట్టుకొని సందడి చేశారు. అమ్మవారికి 'బెల్లం బువ్వను' నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఎం. స్వప్న మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ విశిష్టత పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతో బోనాల పండుగ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

హుస్నాబాద్‌రూరల్, జూలై 29: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన హుస్నాబాద్ మండల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పారన్నారు. వర్కర్స్ యూనియన్ నాయకులు సంపత్, మహేందర్, సదానందం, శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై విజయ్‌భాస్కర్

అక్కన్నపేట, జూలై 29: సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అక్కన్నపేట ఎస్సై విజయభాస్కర్ సూచించారు. సోమవారం పీఎస్ ఆవరణంలో ఆయన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. బ్యాంకు అధికారుల పేరిట వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా అవసరం ఉంటే బ్యాంకుకు వెళ్లాలని, ఫోన్‌లో బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని లేదంటే 100కు డయల్ చేసి వివరాలు చెప్పాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చేర్యాల, జూలై 29 : నంగునూరు మండలంలోని ఖాతా నుంచి చేర్యాల పట్టణానికి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నది. ఆదివారం అర్ధరాత్రి దాటిన అనంతరం చేర్యాలకు ఖాతా నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను పలువురు వ్యక్తులు పట్టుకున్నారు.వెంటనే రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులకు సమాచారం అందించారు.అనంతరం సదరు ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొన్ని నెలలుగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారని, సంబంధిత శాఖ అధికారులు రవాణా అరికట్టేందుకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు ఇసుక వేలం

మద్దూరు(ధూళిమిట్ట),జూలై29: మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో సీజ్ చేసిన ఇసుకకు మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు మద్దూరు తహసీల్దార్ సంజీవ్‌కుమార్ తెలిపారు. మద్దూరు మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లతో పాటు లారీని పోలీసులు పట్టుకొని, ఇసుకను సీజ్ చేసి తహసీల్ కార్యాలయం ఆవరణంలో భద్రపర్చినట్లు తెలిపారు. సుమారు నాలుగు ట్రాక్టర్లు, లారీ ఇసుకకు నిర్వహిస్తున్న వేలంలో పాల్గొనేవారు. రూ.5వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

హామీలను గాలికొదిలి విమర్శలా..

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, జూలై 29 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని చిన్నకోడూరు మండల మాజీ వైఎస్ ఎంపీపీ కీసరి పాప య్య అన్నారు. సోమవారం బీఆర్ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణను ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లిన కేసీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి నేడు మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ నాయకులను విమర్శించడం పనిగా పెట్టుకున్నారన్నారు. ఇందిరమ్మ ఇల్లు, గృహాలక్ష్మికి రూ.2500, కౌలు రైతుకు రూ.12000, కల్యాణలక్ష్మి ఊసేలేదని వారు దుయ్యబట్టారు.

రైతుల నుంచి బలవంతంగా డిపాజిట్లు స్వీకరించం

మద్దూరు(ధూళిమిట్ట), జూలై29: పంట రుణాల రెన్యువల్ సమయంలో రైతుల నుంచి బలవంతంగా డిపాజిట్లు స్వీకరించమని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్(ఆర్ఎం) ఆర్. ఉదయ్‌కిరణ్ అన్నారు. ఈ నెల 27న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'పంట రుణాలకు బ్యాంక్ కొర్రీ లు' అనే కథనం ప్రచురితం కావడంతో స్పం దించిన ఆయన 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో ప్రత్యేకంగా కథనంపై వివరణ ఇచ్చారు. రైతుల సమ్మతితోనే కొంత నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయాలని ఎవరిపై తాము ఒత్తిడి తేవడం లేదన్నారు. గడువులోపు రెన్యువల్ చేసుకోవడానికి డిపాజిట్ అమౌంట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వడ్డీశాతం అధికం కాకుండా చూసేందుకు రైతుల అనుమతితో మాత్రమే డిపాజిట్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్ల అంశాన్ని రైతులు సానుకూలంగా తీసుకొని తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేషన్ డీలర్లకు బీమా సౌకర్యం కల్పించాలి

మాట్లాడుతున్న రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్

మద్దూరు(ధూళిమిట్ట), జూలై29: రేషన్ డీలర్ల కుటుంబాలకు ఆరోగ్య కార్డులు అందించి బీమా సౌకర్యం కల్పించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దొమ్మాటి రవీందర్, ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణులపల్లి చంద్రం డిమాండ్ చేశారు. సోమవారం మద్దూరు మండలంలోని వంగపల్లిలో రేషన్ డీలర్ చాట్ల జయంరామ్ అంత్యక్రియల్లో రేషన్ డీలర్లతో కలిసి వారు పాల్గొని నివాళులర్పించారు.కార్యక్రమంలో మద్దూరు, ధూళిమిట్ట, చేర్యాల మండల అధ్యక్షులు ఎండీ కరీం, రమేశ్, సంజీవరెడ్డి, జిల్లా కోశాధికారి రాజన్న, మీడియా ఇన్‌చార్జి నవజీవన్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సినారే రచనలు యువతకు ఆదర్శం

గుండారెడ్డిపల్లిలో సినారే చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాజు

కోహెడ, జూలై 29: డా.సి నారాయణరెడ్డి రచనలు నేటి యువతకు ఆదర్శమని సామాజిక కార్యకర్త రాజు అన్నారు. సోమవారం కోహెడ మండలం గుండారెడ్డిపల్లిలోని సిద్ధప్ప ఆశ్రమంలో సినారే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీనివాస్, భూమయ్య పాల్గొన్నారు.

సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

మర్కూక్, జూలై29: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు సాయి రెడ్డిరాంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను విస్మరించి బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం బాధాకరమన్నారు. మండలంలోని కొండపోచమ్మసాగర్‌ను నింపి కాల్వల ద్వారా రైతులకు నీళ్లు అందించే వరకు పోరాటం చేస్తామన్నారు. జిల్లా ప్రదాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్,బీజేపి సీనియర్ నాయకుడు సింగం సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు రమేశ్‌గుప్తా, మండల ఉపాధ్యక్షుడు మహేశ్‌గౌడ్,సోషల్ మీడియా కన్వీనర్ కిషోశ్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శులు రాజేందర్‌సింగ్,తిరుపతిరెడ్డి,బీజేపీ కిసాన్ సెల్ అధ్యక్షుడు పాండుసింగ్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక,జూలై 29: దుబ్బాక మున్సిపల్ పరిధిలో మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మాజీపేటకు చెందిన కాస్తి సాయి (27) అనే యువకుడు నాలుగేండ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వివాహం జరిగిన కొద్ది నెలలకే అతడి భార్య విడాకులు ఇచ్చింది. దీంతో సాయి మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 24న సాయి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడగా హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగారాజు తెలిపారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



బురదమయంగా పెద్దతండా –కట్కూరు మధ్య రోడ్డు

అక్కన్నపేట, జూలై 29: మండలంలోని పెద్దతండా నుంచి కట్కూరు మీదుగా కన్నారం ద్వారా మండల కేంద్రానికి వెళ్లేందుకు రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షం పడితే ఈ దారి గుండా ప్రయాణం ఇబ్బందికరంగా మారుతున్నది. రాకపోకలకు అంతరాయం కలుగడంతోపాటు అక్కన్నపేటకు వచ్చేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన పడొద్దు

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 29: సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందవద్దని, దొరికే అవకాశం ఎక్కువ ఉంటుందని సిద్దిపేట సీపీ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ ఎక్కడైనా పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా వెంటనే సీఈఐఆర్ డాటా నమోదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. 29 జూలై 2014 నుంచి 20 ఏప్రిల్ 2023 వరకు 978 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకొని సంబంధిత బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఫోన్ దొంగతనం జరిగిన వెంటనే పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగమైందన్నారు. కేంద్రం సీఈఐర్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వీఆర్ఏల వారసులు

సిద్దిపేట టౌన్,జూలై 29 : వీఆర్ఏల వారసులకు ప్రభుత్వం తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని వారసత్వ వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు గుడుమల్ల రాజలింగం డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వీఆర్ఏల సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీవో నెంబర్ 81,85 ప్రకారం 61 ఏండ్లు నిండిన ఏఆర్ఏల వారసులకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని స్పష్టంగా ఉందన్నారు.ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని..ఆరునెలలు గడుస్తున్నా ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు కాంగ్రెస్ సర్కారు వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నేతలు వెంకటస్వామి, సత్యం,మహేశ్,ఆసిఫ్, సంతోష్‌కుమార్, బాలరాజు,సుందర్, వీఆర్ఏ సహాయకులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

నినాదాలు చేస్తున్న బీసీ సంఘం నేతలు

సిద్దిపేట టౌన్,జూలై 29 : కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కామారెడ్డిలో జరిగిన ఎన్నికల సభలో రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.కానీ ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజరేషన్లు,సంక్షేమ పథకాలను అమలు చేయడంలేదని మండిపడ్డారు.ప్రభుత్వం కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. అనిల్‌కుమార్, భార్గవ్, ప్రభు,నరేందర్, వెంకటేశ్,సంతోష్, గణేశ్, అరుణ్, స్వామి, చంద్రబాబు,సాయికుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న కుర్మ సంఘం మండల నాయకులు

కోహెడ, జూలై 29: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన బొప్పనపల్లి తిరుపతి, కుర్మ సంఘం మండల కార్యదర్శి తండ్రి బొప్పనపల్లి భీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం కుర్మ సంఘం మండల నాయకులు మృతుల కుటుంబాలను పరామర్శించి 50కిలోల చొప్పున బియ్యం అందజేశారు. కుర్మ సంఘం నాయకులు కోనే శేఖర్, చిగిరి కొమురయ్య, చుక్క అశోక్, కూకట్ల శ్రీశైలం, మీస కొమురయ్య, చిగిరి రాజమల్లయ్య, భూమల్ల కనుకయ్య, బొప్పనపల్లి స్వామి, గుడ్ల అశోక్ పాల్గొన్నారు.

గోరింటాకుతో ఆరోగ్య ప్రయోజనాలు

సిద్దిపేట, జూలై 29 : గోరింటాకు పెట్టుకోవడం వల్ల వర్షాకాలంలో మహిళలకు తలెత్తే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని జిల్లా బీసీ సంక్షేమ, అభివృద్ధి అధికారి సరోజ అన్నారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ, యూటీఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట వ్యాస మహర్షి యోగా కేంద్రంలో గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి,యూటీఎంఏ రాష్ట్ర అధ్యక్షురాలు లక్కి రెడ్డి విజయ, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శిక్షకురాలు సంధ్య, కార్యదర్శి సతీశ్, సభ్యులు ఉమా సురేశ్‌రెడ్డి , శారద, నందిని, విజయ , మాధవి, హేమలత , చందన, వాసవి, స్వప్న, ఉష, సాగరిక, జయశ్రీ పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రపర్చాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 29: మద్దూరు మండలం గాగిళ్లాపూర్‌లో కొన్నేండ్లుగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రపర్చడం లేదని, వెంటనే శుభ్రపర్చాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్తులు ట్యాంక్‌ను సందర్శించి మాట్లాడారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రపర్చక కలుషిత నీటిని తాగాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రపర్చాలన్నారు. మోకు ఉదయ్‌రెడ్డి, పైస బాలకృష్ణ, గొడుగు ప్రశాంత్, బోడపట్ల బాబు, నారదాసు శివ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చేర్యాల, జూలై 29 : మండలంలోని ముస్త్యాలలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ ఘటనలో దొంగలు అమ్మవారి ముక్కుపుడకతో పాటు మండపంలో ఉండే ఇత్తడి గంటను ఎత్తుకుపోయారు. ఆలయంలో చోరీ జరగడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు విచారణ ప్రారంభించారు.ఇటీవల మండలంలోని ఆకునూరులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సైతం దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకుపోగా తాజాగా ముస్త్యాలలోని ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది.

ఆలయ అభివృద్ధికి కృషి

మద్దూరు(ధూళిమిట్ట), జూలై29: కాకతీయుల కాలంలో నిర్మితమైన ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి అన్నారు. సోమవారం బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాచీన ఆలయంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందించనున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు కూకట్ల బాలరాజుయాదవ్, బండి శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), జూలై 29 : అక్బర్‌పేట–భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఎల్లయ్య ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఉప సర్పంచ్ గురుక పరశురాములు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను